ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 31.05.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. అథ్లెటిక్స్ లో దేశం సాధించిన ప్రేరణాత్మకమైన ఘనత అందరికీ గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల్లో నాలుగు జాతీయ రికార్డులను నెలకొల్పడాన్ని నరేంద్ర మోదీ తన మన్ కీ బాత్ ప్రసంగంలో కొనియాడారు.

2. 'నమామి గంగే అభియాన్ ' కింద మొబైల్ ఆస్పత్రిలా రూపొందించిన మొట్టమొదటి రెస్క్యూ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసి0చారు.

3. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి జూన్ 4, 5 తేదీల్లోగా పూర్తిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

4. క్రీడలు, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో జూన్ 7న ‘ఫిట్ ఇండియా–సండేస్ ఆన్ సైకిల్’ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది.

**ఎంకెబి క్రీడాకారులు**

అథ్లెటిక్స్ లో దేశం సాధించిన ప్రేరణాత్మకమైన ఘనత అందరికీ గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఇటీవల రాంచీలో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల్లో నాలుగు జాతీయ రికార్డులను నెలకొల్పడాన్ని నరేంద్ర మోదీ ప్రశంసించారు. ప్రధానంగా ఇద్దరు అథ్లెట్లు గురిందర్‌వీర్ సింగ్ , అనిమేష్ కుజూర్ పురుషుల 100 మీటర్ల పరుగు పందెంలో జాతీయస్థాయిలో పాతరికార్డులను మూడుసార్లు అధిగమించడాన్ని

ప్రస్తావించారు. 100 మీటర్ల పరుగుపందెంలో భారతీయులు రికార్డు సాధించగలిగిన శరీరం లేదన్న అపోహలను వీరిద్దరూ పటాపంచలు చేశారని కొనియాడారు. ప్రధానమంత్రి తన మనసులోని మాటను ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ ప్రసంగం 134వ సంచిక ఈ ఉదయం ఆకాశవాణిలో ప్రసారం అయ్యింది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఇద్దరు అథ్లెట్లతో ప్రత్యేకంగా ముచ్చటించారు.

**బైట్ - ఎంకెబి స్పోర్ట్స్**

మామిడి

వేసవిని తట్టుకునేందుకు భారతదేశంలో వివిధ ప్రాంతాల ప్రజలు వివిధ రకాల పానీయాలతో ఉపశమనం పొందుతారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు.  అలాగే, వేసవి వచ్చిందంటే మామిడి పండ్ల గురించి చర్చించని ఇల్లు ఉండదని అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో దొరికే మామిడి పండ్ల రకాలను ప్రధానమంత్రి తన మన్ కీ బాత్ లో ప్రస్తావించారు. మహారాష్ట్ర, కొంకణ్ ప్రాంతాల్లో దొరికే హాపుస్ , అల్ఫోన్సో.. గుజరాత్ లో దొరికే కేసర్ , ఉత్తర ప్రదేశ్ లో దొరికే దశహరి. దక్షిణ భారతదేశంలో దొరికే బంగనపల్లె , తోతాపురి, నీలం, మాల్గోవా రకాలు, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ లలో దొరికే సువర్ణరేఖ గురించి నరేంద్రమోదీ వివరించారు.

**బైట్ - ఎంకెబి మామిడి**

**నెదర్లాండ్స్**

భారతదేశ అమూల్యమైన వారసత్వాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలియజేశారు. తాను ఇటీవల నెదర్లాండ్స్ వెళ్లిన సమయంలో చోళుల కాలం నాటి పురాతన రాగి ఫలకాలను భారతదేశానికి తిరిగి అప్పగించారని గుర్తు చేశారు. వాటిలో 21 పెద్ద , మూడు చిన్న రాగి ఫలకాలు ఉన్నాయని , అవి చోళ సామ్రాజ్య గొప్పతనానికి నిదర్శనమని ప్రధానమంత్రి కొనియాడారు. అవి చోళ రాజవంశం విజయాలను వివరించేలా ఉన్నాయన్నారు.

**బైట్  - ఎంకెబి రాగి ఫలకాలు**

'జ్ఞాన భారతం అభియాన్ ' కింద ఛత్తీస్‌గఢ్‌లోని మల్హార్‌లో మూడు అరుదైన రాగి ఫలకాలు లభించాయని నరేంద్రమోదీ తెలిపారు. అవి పాండువంశానికి చెందిన మహర్షి బాలార్జునుని పాలనా కాలానికి సంబంధించినవని , ఈ రాగి ఫలకాలు ప్రాచీన బ్రాహ్మీ లిపి , పాలి భాషలో లిఖితమై ఉన్నాయన్నారు.

**ఖగోళశాస్త్రం**

ఖగోళ శాస్త్రం దశాబ్దాలుగా అన్వేషణకు స్ఫూర్తినిస్తోందని , ఇప్పటి యువత కూడా దానిపట్ల ఉత్సాహం చూపిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఫలితంగా దేశవ్యాప్తంగా ఖగోళశాస్త్ర క్లబ్‌లు ప్రాచుర్యం పొందుతున్నాయని మన్ కీ బాత్ లో ప్రధాని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే బెంగళూరు ఆస్ట్రోనామికల్ సొసైటీ , 'ఖగోళ్ మండల్', ఆస్ట్రో కేరళ, బిగ్ బ్యాంగ్ ఆస్ట్రానమీ క్లబ్ వంటి సంస్థలు పరిశీలనా కార్యక్రమాలు , ప్రత్యేక కోర్సులు కూడా నిర్వహిస్తున్నాయన్నారు. ఈ సెలవుల్లో యువత ఒక ఖగోళ శాస్త్ర క్లబ్‌లో చేరాలని , ఏదైనా ప్లానెటేరియంను సందర్శించాలని ప్రధానమంత్రి కోరారు.

**బైట్ - ఎంకెబి ఖగోళ శాస్త్రం**

**డాల్ఫిన్స్ రెస్క్యూ అంబులెన్స్**

'నమామి గంగే అభియాన్ ' కింద మొబైల్ ఆస్పత్రిలా రూపొందించిన డాల్ఫిన్ రెస్క్యూ అంబులెన్స్ ఇటీవల మొట్టమొదటి రెస్క్యూ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసిచారు. ఉత్తర ప్రదేశ్ లో ఓ కాలువలో చిక్కుకుపోయిన గంగా డాల్ఫిన్ ను రక్షించి చికిత్స అందించి రాప్తి నదిలోకి విడిచి పెట్టారని తెలిపారు. ఈ ఆపరేషన్ పూర్తిచేయడానికి సుమారు 13 గంటల సమయం పట్టిందని వివరించారు. దీనివల్ల కేవలం ఒక జాతిని మాత్రమే కాపాడటం లేదని, గంగానది జీవవైవిధ్యాన్ని కాపాడుతున్నామని ప్రధానమంత్రి గుర్తు చేశారు. మన భవిష్యత్ తరాల కోసం ఒక అమూల్యమైన సహజ వారసత్వాన్ని పరిరక్షిస్తున్నామని చెప్పారు.

బైట్ - ఎంకెబి డాల్ఫిస్ రెస్క్యూ

**మన్ కీ బాత్ స్పందన**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని విన్న పలువురు ఆకాశవాణికి తమ స్పందనను తెలియజేశారు.

BYTES

ANNOUNCEMENT

ప్రధానమంత్రి మన్ కీ బాత్ ప్రసంగానికి తెలుగు అనువాదం ఈ రాత్రి 8 గంటలకు పునఃప్రసారమవుతుంది.

**కిషన్ రెడ్డి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 134వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్లో ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... సామాజిక , ఆర్థికాభివృద్ధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం ఒక గొప్ప వేదికగా నిలుస్తుందన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలో గడిచిన 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు.

బైట్ ... కిషన్ రెడ్డి

పిటిసి, హైదరాబాద్

**ధాన్యం కొనుగోలు**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి జూన్ 4 , 5 తేదీల్లోగా పూర్తిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి , జిల్లా ఉన్నతాధికారులతో ఆయన ధాన్యం కొనుగోలు పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూప్రస్తుత యాసంగి సీజన్‌లో 66 లక్షల ఎకరాల్లో సాగు చేసిన వరి నుంచి 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, రాష్ట్ర ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. లక్ష్యానికి మించి వచ్చిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

**పీటీసీ - మహబూబ్ నగర్**

**శాట్**

క్రీడలు, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 7న గచ్చిబౌలి స్టేడియంలో 'ఫిట్ ఇండియా–సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని.. శాట్స్ ఎండి డాక్టర్ ఎ. సోనిబాలా దేవి లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వానించారు.

**డెస్క్**

**సమీక్ష**

తెలంగాణ ఉద్యోగులు , పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు సంబంధించి ప్రభుత్వం అమల్లోకి తీసుకువస్తున్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో రేపు సమీక్ష నిర్వహించనున్నారు. ఎంప్లాయి హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ఈ పథకం అమలు కానుంది. ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు, పెన్షనర్ల నుంచి ఇద్దరు ప్రతినిధులు ఈ ట్రస్ట్ సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి ఒకరిని ఈ ట్రస్ట్ కు సీఈవోగా నియమిస్తారు. ఈ కమిటీను రేపు ప్రకటించే అవకాశముంది. ప్రభుత్వ ఉద్యోగులు , పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించేందుకు ఫైనాన్స్ శాఖ ఇప్పటికే అన్ని శాఖలకు సర్క్యులర్ జారీ చేసింది. ఈ వివరాల ఆధారంగా డిజిటల్ హెల్త్ కార్డులు, క్యాష్‌లెస్ చికిత్స సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

డెస్క్

**ప్రజావాణి**

రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన రేపు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్నందున సోమవారం మంచిర్యాల కలక్టరేట్ లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు , దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి జిల్లా కలెక్టరేట్‌కు రావద్దని , అధికారులకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

కొనుగోలు కేంద్రం

ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండల కేంద్రంలో జిసిసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక శాసన సభ్యురాలు కోవ లక్ష్మీ జిసిసి అధికారి సందీప్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ... రైతులు దళారుల ద్వారా మోసపోవద్దని అన్నారు. రైతులు దళారులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రంలోనే అమ్మాలని సూచించారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

**సురక్ష**

మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణ , భద్రత కోసం ప్రారంభించిన 'మీ సురక్ష' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని పోలీసు కమిషనర్ సుమతి తెలిపారు. మే 16న ప్రారంభమైన ఈ కమ్యూనిటీ పోలీసింగ్ డ్రైవ్‌లో ఇప్పటివరకు 18వేల 413 మంది గృహ కార్మికులు, ఇతర సహాయక సిబ్బంది స్వచ్ఛందంగా తమ పేర్లను నమోదు చేసుకున్నారని వెల్లడించారు. ఇటీవల నగరం, శివారులోని గేటెడ్ కమ్యూనిటీలలో నేపాల్‌కు చెందిన పనివారు హత్య, దోపిడీలకు పాల్పడిన ఘటనల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు.. అద్దెదారులు ,

గృహ సహాయకులు, వాచ్‌మెన్‌లు తదితర సిబ్బంది వివరాలతో ఒక డేటాబేస్ రూపకల్పనను చేపట్టారు.

**పీటీసీ - మల్కాజ్ గిరి**